

## గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగం అధికారుల దాడులు.. 13 కేసులు నమోదు

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** గృహ అవసరాల కోసం కేటాయించిన డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగిస్తున్న ప్రైవేట్ హాస్టళ్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై మలక్‌పేట్ సర్కిల్ పౌర సరఫరాల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దిల్‌సుఖ్‌నగర్, పి అండ్ టి కాలనీ, గడ్డి అన్నారం ప్రాంతాల్లోని హాస్టళ్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 13 కేసులు నమోదు చేసి 20 గృహ అవసరాల సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ద్వారా సిలిండర్లు అక్రమంగా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులను రద్దు చేస్తామని ఏసీఎస్వో నర్సింగ్‌రావు హెచ్చరించారు. దాడుల్లో డీటీఐ హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్లు ప్రదీప్ కుమార్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేసు నమోదు చేయాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై సినీ రచయిత, ఎంపీ విజయేంద్ర ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేసిన అంశంపై ఇచ్చిన ఫిర్యాదుపై నేటికీ స్పందించ లేదని మాల సంక్షేమ సంఘం మండిపడింది. ఈ మేరకు మాల సంక్షేమ సంఘం, ఇతర సంఘాల నాయకులు సైఫాబాద్ పోలీసులను కలిసి చర్చించడం జరిగింది. 24 గంటల్లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని మాల సంక్షేమ సంఘం ప్రతినిధులు హెచ్చరించారు.

## జాతీయ స్థాయి షూటింగ్ పోటీల్లో తెలంగాణ కానిస్టేబుల్‌కు బహుమతులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ స్థాయి షూటింగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు చెందిన కానిస్టేబుల్ ఎ.రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 నుండి మార్చి 1 వరకు జరిగిన '19వ ఆల్ ఇండియా పోలీస్ షూటింగ్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ (2025 26)'లో ఆయన ఈ ఘనత సాధించారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తూ, ప్రస్తుతం స్పోర్ట్స్ ఐజీ కార్యాలయానికి అటాచ్‌మెంట్‌లో ఉండి శిక్షణ పొందుతున్న రాజ్‌కుమార్, 300 మీటర్ల రైఫిల్ ప్రోన్ వ్యక్తిగత విభాగంలో రజత పతకాన్ని, 300 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో డిజిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఐజి డా. గజరావు భూపాల్, షూటింగ్ కోచ్ పి. శ్రీరామ మూర్తి, స్పోర్ట్స్ ఆఫీసర్ డా. ఆర్.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజా పక్షం/కంటోన్మెంట్:** పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం మహిళలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. బుధవారం తాడుబందు మసీదులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రంజాన్ పండుగను ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలనే మంచి ఉద్దేశంతో అవసరమైన సరుకులను అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రుల నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్, అబీద్, కరణ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

నలుగురు నిందితులు అరెస్ట్

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ మోసాలకు సహకరిస్తున్న నలుగురు నిందితులను హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల పేరుతో తీసుకున్న సిమ్ కార్డులను మోసపూరిత కార్యకలాపాల కోసం సరఫరా చేసినట్లు గుర్తించారు. నగరానికి చెందిన 36 ఏళ్ల వ్యక్తికి 2025లో బెట్‌ఇన్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధులమని చెప్పుకుంటూ వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు, కాల్స్ పంపించారు. క్రికెట్ బెట్టింగ్, తీన్ పట్టి, క్యాసినో వంటి ఆటల ద్వారా భారీ లాభాలు వస్తాయని నమ్మించి ప్రలోభపెట్టారు. ముందుగా రూ.20,001 డిపాజిట్ చేయగా రూ.5,000 లాభం రావడంతో బాధితుడు వారిని నమ్మాడు. ఆ తర్వాత నిందితుల ప్రోద్బలంతో బాధితుడు తన భార్య బ్యాంక్ ఖాతాల నుంచి సుమారు రూ.1.5 కోట్లు వివిధ యూపీఐ ఐడిలు, క్యూఆర్ కోడ్లు, క్యాష్ డిపాజిట్ మిషన్ల ద్వారా చెల్లించాడు. ప్రారంభంలో రూ.20 లక్షలు లాభంగా చూపినప్పటికీ, చివరకు మొత్తం సొమ్మును కోల్పోయాడు. బాధితుడు నగదు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించిన ప్రతిసారీ, మోసగాళ్లు రకరకాల పేర్లతో వెబ్సైట్ డొమైన్లు మారుస్తూ అతడిని తప్పుదోవ పట్టించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నలుగురు అరెస్ట్ కాగా.. మిగిలిన వారు పరారీలో ఉన్నారు. కేసును ఛేదించిన సీఐ పి.శివ చంద్ర, ఎస్ఐ ఉమ, హెచ్‌సి సునీల్ కుమార్, పిసిలు గణేష్, సందీప్, విజయ్‌కుమార్, మనీష్ కుమార్, ధరణి, శివకుమార్‌లను హైదరాబాద్ సిటీ డీసీపీ అరవింద్ బాబు అభినందించారు.

## రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణతో

# భద్రతకు పెద్దపీట

**2014–26 మధ్య 54,600 కి.మీ ట్రాక్‌ల పునరుద్ధరణ**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా రైళ్ల సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించేందుకు భారతీయ రైల్వే శాఖ ట్రాక్‌ల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2014 నుంచి 2026 ఫిబ్రవరి వరకు మొత్తం 54,600 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లను పునరుద్ధరించినట్లు కేంద్ర రైల్వే శాఖ తెలిపింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ అశ్వినివైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. రైల్వే ట్రాక్‌ల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటున్నామని, ట్రాక్‌ల వయస్సు, వాటిపై నడిచే రైళ్ల రద్దీ, పరిస్థితులను ఆధారంగా చేసుకొని పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ట్రాక్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి ప్రత్యేక వ్యవస్థను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో రోజువారీ పహారా, కాలినడక తనిఖీలు, ట్రాలీ తనిఖీలు, అలాగే ప్రత్యేక యంత్రాల ద్వారా ట్రాక్‌ల స్థితిని పరిశీలించడం జరుగుతుందని వివరించారు. ట్రాక్‌ల బలాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతికతలను రైల్వేలు విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. 60 కిలోల బరువున్న రైళ్లు, ప్రీస్ట్రెస్డ్ కాంక్రీట్ స్లీపర్లు, ఫ్లాష్ బట్ వెల్డింగ్ వంటి ఆధునిక విధానాలను అమలు చేస్తున్నారు. అలాగే ట్రాక్‌ల నిర్వహణ కోసం అధునాతన యంత్రాలు, రైల్ గ్రైండింగ్ మెషీన్లు, ఇంటిగ్రేటెడ్ ట్రాక్ మానిటరింగ్ సిస్టమ్ వంటి సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ చర్యల ఫలితంగా రైల్వే ట్రాక్‌లపై రైళ్ల వేగ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. 2014లో 40 శాతం మాత్రమే 110 కి.మీ వేగానికి పైగా సామర్థ్యం ఉన్న ట్రాక్‌లు ఉండగా, 2026 నాటికి అది 80 శాతానికి పైగా పెరిగింది. అలాగే 130 కి.మీ వేగం మరియు అంతకంటే ఎక్కువ సామర్థ్యం గల ట్రాక్‌లు 6.3 శాతం నుంచి 22.4 శాతానికి పెరిగినట్లు వెల్లడించారు.రైల్వే నెట్‌వర్క్ మొత్తం భద్రతను మెరుగుపరచడానికి ట్రాక్‌ల బలోపేతం, ఆధునికీకరణ, యంత్రాల వినియోగం వంటి చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నామని కేంద్ర రైల్వే శాఖ తెలిపింది.



## రైల్వేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కాటి, ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్, నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. మహిళా ఉద్యోగి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే 2025–26 సంవత్సరానికి వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు జనరల్ మేనేజర్ పురస్కారాలు అందజేశారు. ఉపన్యాసం, వ్యాసరచన పోటీల విజేతలకు కూడా బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఈ ఏడాది మహిళా దినోత్సవ థీమ్ 'గివ్ టు గెయిన్' అని తెలిపారు. విద్య ద్వారానే సాధికారత సాధ్యమవుతుందని, మహిళా సాధికారతలో సమానత్వం, సమాన అవకాశాలు కల్పించడం మధ్య తేడాను వివరించారు. దక్షిణ మధ్య రైల్వేలో ఆపరేటింగ్, కమర్షియల్, సెక్యూరిటీ, ఫైనాన్స్, మెడికల్ వంటి కీలక విభాగాలతో పాటు గుంటూరు డివిజన్‌ను కూడా మహిళా అధికారులు సమర్థంగా నిర్వహించడం గర్వకారణమని అన్నారు.
ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కాటి మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వేలో సుమారు 8 వేల మంది మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. లోకో పైలట్లు, ట్రాక్ మెయింటెనర్లు, ట్రైన్ మేనేజర్లు వంటి కీలక బాధ్యతలను మహిళలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఉద్యోగ స్థలంలో సమస్యలను నమోదు చేసుకునేందుకు 'షీ పోర్టల్', 'షైన్ యాప్' వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.కార్యక్రమంలో రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె. పద్మజ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ హేమా సునీత, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల రాజారామ్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇటీ పాండే, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్నా సేన్ తదితరులు మహిళలకు ఆరోగ్యం, ఆర్థిక భద్రతపై దృష్టి పెట్టాలని, తమ హక్కుల కోసం ధైర్యంగా మాట్లాడాలని సూచించారు.

## కాలుష్య నియంత్రణ పరికరం ఆవిష్కరణ

త్వరలోనే సంబంధిత మంత్రికి వివరిస్తా

మీడియాతో మార్గాన రామారావు



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** వాహనాల నుంచి వెలువడే వాయు కాలుష్య నియంత్రణకు ప్రత్యేక పరికరాన్ని రూపొందించినట్టు ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో రిటైర్డ్ మెకానికల్ సూపర్‌వైజర్ మార్గాన రామారావు తెలిపారు. 25 ఏళ్ల పాటు ఎంతో శ్రమకోర్చి ఈ పరికరాన్ని కనుగొన్నానని, దీనిద్వారా వాహనాల నుంచి వెలువడే కాలుష్యాన్ని 80శాతం వరకు తగ్గించవచ్చన్నారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ''మాది విశాఖపట్నం. నాకిప్పుడు 71ఏళ్లు. వాయు కాలుష్య సమస్యను పరిష్కరించాలని 2001లో కసరత్తు మొదలుపెట్టా. 'ఇంజిన్ ఎగ్జాస్ట్ ఎమిషన్స్ రెడ్యూసర్' పేరిట పేటెంట్‌కు దరఖాస్తు చేయగా, ఆరు నెలల కిందట ధ్రువీకరణ లభించింది. జిఐ షీట్స్‌తో బాక్సును చేసి కొన్ని సాంకేతిక పరికరాలు, బెండ్లు ఉంచా. ఇది పనిచేయడానికి లోపల పలు రసాయనాలు, నీరు అవసరం. వాహనాల సామర్థ్యం ఆధారంగా సైలెన్సర్ల వద్ద ఈ పరికరాన్ని అమర్చుతాం. బయటకు విడుదలయ్యే పొగను అది పీల్చుకొంటుంది. ఫలితంగా బయటకొచ్చే కాలుష్యం సగానికిపైగా తగ్గుతుంది. పరికరం లేని టిప్పరు నుంచి వచ్చే ఉద్గారాల్లో దూళి, కార్బన్‌మోనాక్సైడ్, నైట్రోజన్ వాయువులు 70.63 శాతం ఉంటే పరికరం అమర్చాక 31.30శాతంగా కనిపించాయి'' అని వివరించారు. ఇప్పటికే ఎపిఎస్ఆర్‌టిసి బస్సులకు పరికరాన్ని బిగించేందుకు ఇచ్చామని, కాలుష్యం తగ్గినట్టు వారు ధ్రువీకరించారన్నారు. అక్కడి ప్రభుత్వం స్పందన కోసం వేచిచూస్తున్నామన్నారు. తెలంగాణలో కూడా ఆర్‌టిసి బస్సుల్లో అమలుకు సంబంధిత మంత్రిని కలుస్తామన్నారు. ఈ పరికరం ధర వాహన సామర్థ్యం బట్టి రూ.20 వేల నుంచి 40 వేల వరకు ఉంటుందని తెలిపారు.

## ఆరు గ్యారంటీల అమలుకు ప్రజా ఉద్యమం

ఎఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ జోజిరెడ్డి



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ త్వరలోనే ప్రజా ఉద్యమం చేపడుతామని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సత్యాగ్రహ దీక్షలు, నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.వి.ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.రాములు యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు ముందుకురావటం సిగ్గుచేటన్నారు. ముందుగా, ఆరు గ్యారంటీలు సక్రమంగా నెరవేర్చి, ప్రజల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా వేయాలని, యూరియా కొరత తీర్చాలని కోరారు. మూసీ నది సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను కూల్చొద్దని, ముందుగా వారికి పునరావాసం కల్పించాకే, తర్వాత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర కన్వీనర్‌గా అందె బీరన్నను నియమించారు. సమావేశంలో పార్టీ నేత రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నీరా కేఫ్'ను గీత పారిశ్రామిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించండి

బిఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'నీరా కేఫ్'ను ప్రైవేటు పరం చేయకుండా గీత పారిశ్రామిక సహకార సంస్థ ఎం.డి ఆధ్వర్యంలోనే నిర్వహించాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం విధ్వంసమే పనిగా పెట్టుకుందని, ఒక దేశం మరొక దేశం పైన దండయాత్ర చేసినట్టుగా కుల వృత్తులపైన దాడి చేస్తున్నదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో కుల వృత్తులకు ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ అందులో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని మండిపడ్డారు. గీత కార్మికులు ప్రమాదశావత్తు మరణిస్తే వారికి చెల్లించే రూ.20 కోట్ల ఎక్స్ గ్రేషియా నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు నగరం నడి బొడ్డున రూ.10కోట్ల నీరా కేఫ్‌ను ఏర్పాటు చేశారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నీరా కేఫ్‌ను ఎత్తేసే పనిలో ఉన్నదని అన్నారు. నందనవనంలో వంద శాతం పూర్తయిన నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని ఈ ప్రభుత్వం ఓపెన్ చేయడం లేదని, ఇంతకు రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖకు మంత్రి ఉన్నారా? లేరా? అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నీరా కేఫ్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగేందర్ గౌడ్ ,పల్లె రవికుమార్ గౌడ్ ,బిసి కమిషన్ మాజీ సభ్యులు కె .కిషోర్ గౌడ్ ,ఉపేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ఆరు నెలల్లోనే మరో పార్టీలో చేరి అదే పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. ఇంత స్పష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ దాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించలేమని చెప్పడం ఆశ్చర్యకరమన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తి మరో పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయడం, అదే పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేయడం వంటి రికార్డులు ఉన్నప్పటికీ కూడా అది ఫిరాయింపు కాదని చెప్పడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని విమర్శించారు.

## కుళ్లిన మాంసం స్వాధీనం




**ప్రజాపక్షం/దూల్‌పేట్:** కుళ్లిన మాంసం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా 300 కేజీల మాంసం స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు, మంగళ్‌హాట్ పోలీసులు, గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్, బల్దియా అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. తాజా మాంసం అని నమ్మిస్తూ, నిల్వ ఉంచిన కుళ్ళిన మాంసాన్ని విక్రయిస్తున్న అఫ్రోజ్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగింది. నిందితుడు గతంలో కూడా ఇటువంటి నేరానికి పాల్పడగా, అప్పట్లో జీహెచ్‌ఎంసీ అధికారులు అతడికి జరిమానా విధించారు. గోల్కొండ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, కుల్సుంపుర ఏసీపీ పర్యవేక్షణలో మంగళ్‌హాట్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.రాఘవేంద్ర, ఎస్ఐలు వినోద్, శ్రుతి, సిబ్బంది కలిసి ఈ దాడుల్లో పాల్గొన్నారు.




## ప్రగతి ప్రణాళికతో సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 6వ రోజు.. జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో అండర్ గ్రౌండ్, ఫ్లయి ఓవర్ బ్రిడ్జిలలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 0.8 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించడం జరిగిందని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ, ఫ్లయి ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జిల వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామన్నారు. జోన్ పరిధిలోని 5 సర్కిళ్లకు చెందిన డిసీలతో పాటు అన్ని విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

## భాగ్యలక్ష్మి అమ్మవారికి గవర్నర్ పూజలు



**ప్రజాపక్షం/చార్మినార్:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్ల బుధవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, మహా హారతి నిర్వహించి అమ్మవారి ఆ శీస్సులు పొందారు. ఈ నేపథ్యంలోనే ఆలయ పూజారి శాస్త్రోక్తంగా గవర్నర్ దంపతుల చేత పూజలు చేయించారు.

## ఉగాది వేడుకలకు ఆహ్వానం



**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** మారిషస్ దేశంలో జరుగబోయే పరాభావనామ ఉగాది వేడుకలకు విశిష్ట అతిథులుగా తెలంగాణా పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రో ధనావత్ సూర్య, అగ్రికల్చర్ కమిషన్ సభ్యురాలు మరికంటి భవానిలకు మారిషస్ తెలుగు మహాసభ సమన్వయకర్త విశ్వకర్మ డిఆర్‌కే ఆహ్వాన పత్రాలను అందించారు. పటేల్ రమేశ్‌రెడ్డి, భవాని ఈ నెల 16న బయలుదేరి 19న ఉగాది వేడుకలలో పాల్గొంటారు. మారిషస్ దేశ ప్రధాని ముఖ్యఅతిథిగా, ఉప ప్రధాని, ఇతర మంత్రులు హాజరవుతున్నారు. పర్యటనలో భాగంగా అక్కడి రాష్ట్రపతి, విదేశాంగ మంత్రి, టూరిజం శాఖ మంత్రితో తెలంగాణ పర్యాటక అభివృద్ధిపైన చర్చలు ఉంటాయని విశ్వకర్మ డిఆర్‌కే తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలపై ట్రాఫిక్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్3కు లలితాబాగ్ వాసులు వివరించారు. ఈ మేరకు ఈ నెల 27న జరగబోయే శ్రీరామనవమి, సీతారాముల కల్యాణ మహోత్సవం, శ్రీరాముని శోభాయాత్ర, వేడుకల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఆలయ నిర్వాహకులు కోరారు. డీసీపీని కలిసిన వారిలో విఘ్నేశ్వరసాయి ధామం కమిటీ చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మునిగంటి సుశీల్‌కుమార్ చారి, అధ్యక్షుడు బొడ్డు వెంకటేష్, కోశాధికారి గుండు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పగిళ్ల నరేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసా దయానంద్, మల్లేష్, యూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి మనీష్ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** గ్రంథాలయ సంస్థకు సంబంధించిన ముఖ్య సమస్యలను పరిష్కరించాలని బల్దియా బాస్ ఆర్‌వీ కర్ణన్‌ను హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి కోరడం జరిగింది. ఈ మేరకు ఆయన బుధవారం కార్యదర్శి పొట్లూరి పద్మజతో కలిసి బల్దియా కమిషనర్‌ను కలుసుకుని సంస్థకు సంబంధించిన పలు కీలక అంశాలపై వివరించి చర్చించారు. హైదరాబాద్ నగర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇందిరమ్మ కాంటీన్ ఆధ్వర్యంలో రూ.ఐదుకే మిల్లెట్స్ క్యాంటీన్ను గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని కోరారు. నగర గ్రంథాలయ సంస్థకు రావలసిన సెస్స్ మంజూరు చేయాలని.. పెండింగ్ బిల్స్ సంబంధించిన చెక్కును కూడా త్వరితగతిన మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరడం జరిగింది.

